క్లుప్తంగా

డీఆర్‌వలస సర్పంచ్‌కు పరామర్శ



జి.సిగడాం: డీఆర్‌వలస గ్రామ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కుమరాపు శ్రీనివాసరావు తల్లి సూర్యం ఇటీవల మృతి చెందారు. దీంతో శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. ఈయనతోపాటు ఎంపీటీసీ సభ్యులు కుమరాపు రమేష్‌నాయుడు, ముషినివలస సర్పంచ్ చందక సతీష్, నాయకులు కుమరాపు సన్యాసిప్పలనాయుడు, మామిడి బలరాం, రామ్మూర్తినాయుడు, చందక మహేష్, కుమరాపు నాగభూషణనాయుడు ఉన్నారు.

వెంకన్నకు విశేష పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

శ్రీకాకుళం కల్చరల్: చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో సుప్రభాతసేవ, అష్టోత్తర శతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు జరిగాయి. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. అనంతరం స్వామికి పూలు, తులసిమాలలతో అలంకరించారు.

సంజీవరాయునికి అష్టోత్తర పుస్తకార్చన



స్వామివారికి పుస్తకార్చన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చినబొందిలీపురంలో హనుమాన్ జయంతి సందర్భంగా సంజీవరాయునికి అష్టోత్తర పుస్తకార్చన శనివారం ఘనంగా నిర్వహించారు. కాశిని వేంకటేశ్వరరావు రచించిన 'అభయ ప్రసన్న మారుతి' 108 పుస్తకాలను స్వామివారికి సమర్పించారు. ఈ పుస్తకంలో స్వామివారి 108 దేవాలయాల విశేషాలు ఉన్నాయని రచయిత చెప్పారు.

ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే



సర్వే చేస్తున్న సిబ్బంది

జి.సిగడాం: ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు కోసం ప్రత్యేకసర్వే చేస్తున్నామని.. తల్లిదండ్రులు సహకరించాలి ఎంఈవోలు అరసాడ రవి, ముళ్ల శ్రీనివాసరావు కోరారు. శనివారం మండల కేంద్రంలోని పలువీధులో ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. భవిత పాఠశాలల్లో నిర్వహించే సేవలపై అవగాహన కల్పించారు. ప్రత్యేక అవసరాల పిల్లలు ఉంటే గ్రామస్థాయిలో పని చేస్తున్న అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయం సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు తాడి కృష్ణ, సీహెచ్‌సీ మాధురి, కృష్ణవేణి ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే అత్యుత్తమ విద్య



విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల సిబ్బంది

రణస్థలం: ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్యా బోధన సాధ్యమని రణస్థలం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.విజయలక్ష్మి అన్నారు. కొండములగాం గ్రామంలో ఇటీవల ఉత్తీర్ణులైన పదో తరగతి విద్యార్థులను కలిసి తమ కళాశాలలో చేరాలని కోరారు. తమ కళాశాలలో మంచి సిబ్బంది ఉన్నారన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ



శాలిహుండంలో పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

గార: ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం ఉదయం నుంచి సచివాలయం సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ నగదు పంపిణీ చేశారు. మండలంలోని 25 పంచాయతీల్లో పంపిణీ కొనసాగింది. మిగిలిన వారికి బ్యాంకు ఖాతాలో నగదు జమచేశారు.

ఘనంగా హనుమాన్ జయంతి



గార: పూజలందుకుంటున్న తండ్యాలపేట అభయాంజనేయస్వామి



జొన్నలపాడు కాలనీలో అభయాంజనేయునికి పూజలు చేస్తున్న భక్తులు



కోదండరామాలయంలో ఆంజనేయునికి పూజలు



గుజరాతీపేటలో అలంకరణలో శక్తిపథ ఆంజనేయస్వామి



ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలో హనుమాన్‌కు పూజలు చేస్తున్న పూజారి



రణస్థలం: జె.ఆర్.పురంలోని రామతీర్థాలు కూడలిలో అంజనేయ స్వామికి పూజలు చేస్తున్న సాయికుమార్



అభిషేకాల కోసం పాలు తీసుకొస్తున్న భక్తులు




కలెక్టర్‌బంగ్లా వద్ద పంచముఖ ఆంజనేయస్వామి



బొందిలీపురంలో ఆంజనేయస్వామికి పూజలు



చింతదత్తక్షేత్రంలో కార్య సిద్ధి ఆంజనేయస్వామి



ఉమారుద్ర కోటేశ్వరాలయంలో ఆంజనేయస్వామి



బలగ బాలత్రిపుర కాలభైరవపీఠంలో పూజలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు ఆలయాలలో హుమమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పాలకొండ రోడ్డులోని కోదండరామాలయంలో అర్చకులు బంకుపల్లి శేషాచార్యులు ఆధ్వరంలో పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. పుణ్యపువీధిలోని సీతారామచంద్రమూర్తి సహిత సువత్సల ఆంజనేయ స్వామికి 108 కలశాలతో పాలాభిషేకాలు, తమలపాకులతో అర్చనలు, గారెలు, నిమ్మకాయలు దండలతో స్వామిని అలంకరించారు. బొబ్బిలికి చెందిన హరేరామ సంకీర్తన భజన, కోలాటం ఆకట్టుకుంది. గుజరాతిపేటలోని జగన్నాథుని మందిరంలో శక్తిపథ ఆంజనేయునికి గారెలు, నిమ్మకాయలు దండలతో అలంకరించారు. కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద భక్తులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. బొందిలీపురం వద్ద ఉన్న దర్బార్ షిరిడీసాయి ఆలయంలో సంతోష్ బ్రహ్మ ఆధ్వర్యంలో నిమ్మకాయలు, సిందూరంతో పూజలు చేశారు. చిం దత్తక్షేత్రంలో సంజీవని కార్యసిద్ధి ఆంజనేయ స్వామికి సింధూరం, అప్పాలు, వడమాల సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు సింహాచలం, గవర గోవిందరావు, జయలక్ష్మి, మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు. ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో ఆంజనేయస్వామి ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు మాధవరావు ఆధ్వర్యంలో అభిషేకాలు, తమలపాకులతో అర్చన నిర్వహించారు. బలగ నాగావళి నదీ తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవాలయంలో ఆంజనేయ స్వామికి 101 లీటర్ల పాలతో అర్చకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అభిషేకం చేశారు. గుజరాతిపేట రాజరాజేశ్వరీ పీఠంలో ఆంజనేయ స్వామికి పెంట రామచంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మంగువారితోటలోని ఆంజనేయస్వామికి అర్చకులు వేమకోటి ప్రదీప్‌శర్మ, భక్తులు కలిసి అభిషేకాలు చేశారు. పొగాకువానిపేటలోని అభయాంజనేస్వామికి అర్చకులు భాస్కరనభట్ల చంద్రశేఖరశర్మ, కృష్ణశర్మశ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

- గార: శ్రీకూర్మనాథుని ఉపాలయమైన స్వయంభువ తండ్యాలపేట అభయాంజనేయ స్వామి ఆలయంలో మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, సింధూర అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తుల సహకారంతో 3వేల మందికి అన్నదానం చేశారు. రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడు కాలనీ వద్ద అభయాంజనేయునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త పందిరి అర్జునరావు, అర్చకులు మావుడూరి మోహనశర్మ, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సెగిడిపేటలో అన్నదానం నిర్వహించారు. కె.మత్స్యలేశం పంచాయతీ వాడపాలెం మెరైన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఆలయం వద్ద అన్నదానం, డైట్ జంక్షన్ వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. దీపావళి జంక్షన్, రామకృష్ణాపురం, కొర్ని, బందరువానిపేట, కళింగపట్నం, శ్రీకూర్మం గ్రామాల్లో ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని అభయాంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. కుశాలపురం, ఎచ్చెర్ల, ఫరీదుపేట, అరిణాం అక్కివలస, చికలపాలెం ప్రాంతాల్లో ఉదయం నుంచి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.

- జి.సిగడాం: మండలంలో అన్ని గ్రామాల్లో ఘనంగా హనుమాన్ జయంతి వేడకులు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం చేశారు.
- రణస్థలం: హనుమాన్ జయంతి సందర్భంగా గ్రామాల్లో అంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జె.ఆర్.పురంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ పలు గ్రామాల్లో జరిగిన వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



జి.సిగడాం: ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



రణస్థలం:జె.ఆర్.పురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు



పొగాకువానిపేటలో ఆంజనేయస్వామికి పూజలు



రాజరాజేశ్వరిపీఠంలో పూజలు

నేడు వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వర స్వామి ఆలయం వార్షిక ఉత్సవాలు ఈ నెల 2న నిర్వహించనున్నట్లు అర్చకులు, నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆదివారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం కల్యాణ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. భక్తులంతా పాల్గొనాలని కోరారు. కాగా, శనివారం ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అష్టోత్తర శతనామాలచే భక్తుల గోత్రనామాలతో పూజలు నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణలు జరిగాయి. స్వామికి పూలు, తులసిమాలలతో అలంకరించారు.



మొండేటివీధిలోని వేంకటేశ్వరుడు

ఐసెట్ ర్యాంకర్లకు అభినందనలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఏపీఐసెట్–2024 ఫలితాల్లో శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్‌కాలేజ్ రోడ్‌లో ఉన్న కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ (కోఎడ్యుకేషన్) కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారని డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి, ప్రిన్సిపాల్ వి.వేణుగోపాల్ తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ కళాశాల నుంచి ఎంపీసీఎస్‌కు చెందిన బొరిగి శ్రీకాంత్ 33వ ర్యాంకు, ఊన్న ధరణి 73, పి.బాలశివప్రసాద్ 285, సింహాద్రి మోనీష్ 532, జీవీఎస్ఎస్ అనూరాధ 549, ఎస్.వైష్ణవి 638, డి.దేవయాని 680, సీపాన నిఖిత 687, ఎ.జ్యోతి స్వరూప్ 706, కర్రి భరత్ 879. డి.శరత్‌చంద్ర 898 వంటి మెరుగైన ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ఇంతటి ఫలితాల సాధించిన విద్యార్థులను, తీర్చిదిద్దిన అధ్యాపకులను అభినందించారు.

తొలిరోజు హాజరు అంతంతమాత్రమే

శ్రీకాకుళం న్యూకాలనీ: 2024–25 కొత్త విద్యా సంవత్సరాన్ని జిల్లాలో జూనియర్ కాలేజీలు ప్రారంభించాయి. వేసవి సెలవుల అనంతరం శనివారం తొలిసారిగా తెరుచుకున్నాయి. ముఖ్యంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీలు శతశాతం పనిచేశాయి. ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు హాజరయ్యారు. అభ్యర్థులు అంతంతమాత్రంగానే హాజరైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. కొన్ని కాలేజీల్లో కనీసం పది మంది కూడా హాజరుకాలేదని తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లోని కాలేజీలకై తే కనీసం విద్యార్థులే రాలేదని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. మరోవైపు అడ్మిషన్ డ్రైవ్, సప్లిమెంటరీ జవాబుపత్రాల ఆన్‌లైన్ మూల్యాంకనంపై సిబ్బంది దృష్టి పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ అందుబాటులో లేకపోవడంతో అక్కడి అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. అందుకు ప్రత్యామ్నాయ ఆలోచనలు చేసే విధంగా ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులకు నివేదించేందుకు అధికారులు సిద్ధమౌతున్నట్లు తెలిసింది.

ఇంజినీరింగ్ విద్యార్థికి ఆర్థిక సాయం

సంతబొమ్మాళి: మండలంలోని బడే కుప్పన్నపేటకు చెందిన కేపీ స్పందన ఫౌండేషన్ సంస్థ తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ఇజ్జిన జోషికుమార్‌కు శనివారం ఆర్థిక సహాయం అందించారు. జోషి టెక్కలి ఐతం కాలేజీలో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ ఫీజు బకా యి, ఉద్యోగ శిక్షణకు రూ.13వేలు సాయం చేయాలని సోషల్ మీడియా ద్వారా విన్నవించగా కె.పి. స్పందన ఫౌండేషన్ స్పందించి హాస్టల్‌కి వెళ్లి నగదు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు షణ్ముఖరావు, సురేష్‌రెడ్డి, సిమ్మన్న, చందు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న దాతలు

31 మంది ప్రత్యేకావసరాల పిల్లలు గుర్తింపు

సోంపేట: మండలంలో పాత్రకొండ, పాలవలస, కర్తలిపాలెం, కొర్లాం గ్రామాల్లో సర్వే చేపట్టి 31 మంది ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించినట్లు భవిత కేంద్రాల సిబ్బంది శ్రీను, రమేష్ శనివారం తెలిపారు. విద్యార్థులందరికీ ఉచితంగా పరికరాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. భవిత కేంద్రాల్లో విద్య, ఫిజియోథెరపి వంటి సేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులు భవిత కేంద్రాల సేవలను వినియోగించుకోవాలని కోరారు.

పలువురిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ, సంతసీతారాంపురం గ్రామాలకు చెందిన పలువురిపై పోలీసులు ముందుస్తుగా శనివారం కేసులు నమోదు చేశారు. సంతసీతారంపురంలో గాలి వెంకటరెడ్డి, చిన్నారెడ్డి, పొన్నాడలో సాధు మూసలయ్య, నేతింటి నీలమప్పుడుపై 151 సీఆర్‌పీ సెక్షన్ నమోదు చేశారు. ఈ నెల నాలుగో తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా పూర్తిచేయడమే లక్ష్యమని ఎస్సై చెప్పారు. వీరికి స్టేషన్ బెయిల్ మంజూరు చేసినట్లు ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

తెలుగు భాషపై పట్టు సాధించాలి



తెలుగు వ్యాకరణం బోధిస్తున్న కృష్ణారావు

శ్రీకాకుళం అర్బన్: మాతృభాష తెలుగుపై విద్యార్థులు పూర్తిస్థాయిలో పట్టు సాధించాలని తెలుగు పండిట్ కృష్ణారావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా తెలుగు పండిట్ కృష్ణారావు తెలుగు వ్యాకరణంలో భాషాభాగాలు గురించి విద్యార్థులకు బోధించారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ భాస్కరరాజా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్మీ రైజింగ్ డే



కార్యక్రమంలో పాల్గొన్న సైనికులు, కుటుంబ సభ్యులు

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురంలో శనివారం భారత ఆర్మీ రైజింగ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సైనిక సేవాసమితి అధ్యక్షుడు కె.దేవదాసు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ముందుగా సర్పంచ్ గొరకల వసంతరావు చేతుల మీదుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. భారత సైన్యం త్యాగాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం సైన్యంలో సుదీర్ఘ కాలం పాటు పని చేసి సుబేదార్(ఆర్డినరీ కెప్టెన్)గా ఇటీవల పదవీ విరమణ పొందిన కె.చలపతిరావు, శ్యామలకుమారి దంపతులను ఘనంగా సన్మానించారు. 30 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో ఇండియన్ ఆర్మీలో పని చేసిన ఆయన మధుర నుంచి పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

ఘనంగా బాబా ఆలయ వార్షికోత్సవం



బాబాకు పూజలు చేస్తున్న భక్తులు



సత్యవ్రతాలు చేస్తున్న మహిళలు

జి.సిగడాం: పెంట గ్రామంలోని షిర్డీసాయిబాబా ఆలయ 12వ వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఓంసాయి.. శ్రీసాయి.. జయ జయ సాయి నామస్మరణతో గ్రామమంతా హోరెత్తింది. ఈ సందర్భంగా సత్యవ్రతాలు, హోమాలు నిర్వహించారు. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. నాగులవలస, మర్రివలస, వీఆర్ అగ్రహారం, సీతంపేట, నక్కపేట, గేదెలపేట, మానంపేట, లింగాపురం, రాజాం, పొగిరి గ్రామాలకు చెందిన సాయిస్వాములు పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

చెట్లకొమ్మల తొలగింపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ పరిధిలో ఉన్న చెట్లతో ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తమీమ్ అన్సారియా అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పలు కాలనీల్లో ప్రమాదకరంగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించే పనులను శనివారం పరిశీలించారు. తుపాన్లు, ఈదురు గాలులు వేసి చెట్టు కొమ్మలు పడి విద్యుత్ సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కమిషనర్‌తో పాటు అసిస్టెంట్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.



చెట్లకొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్

విద్యార్థులకు పోటీలు

శ్రీకాకుళం అర్బన్: బలగ హడ్కో కాలనీలోని శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శనివారం లైబ్రేరియన్ పి.ఉగ్రసేను ఆధ్వర్యంలో పిల్లలకు ముందుగా నీతి కథలు, పద్యాలు చెప్పారు. అనంతరం క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. 9వ తరగతి విద్యార్థిని మేఘన, 7వ తరగతి విద్యార్థి జోగేంద్ర సాయి, 8వ తరగతి విద్యార్థి నిఖిల్ సాయి తొలి మూడు స్థానాల్లో నిలిచి బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు కె.అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.



క్యారమ్స్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం